ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3, కనిష్ఠం 19.5
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
సోమవారం 10 ఫిబ్రవరి 2025



నేడు ఆర్మూర్‌కు త్రిపుర గవర్నర్ రాక

ఆర్మూర్ రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి ఆర్మూర్ పట్టణానికి రానున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు గుత్ప శివారులోని శ్రీ అపురూప వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి అంకాపూర్‌లోని లాలన ఆశ్రమాన్ని సందర్శిస్తారు. అనంతరం ఆర్మూర్ పట్టణంలో శ్రీ నవనాథ సిద్దేశ్వర ఆశ్రమంలో పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం బీజేపీ సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి నివాసానికి వెళ్లి అనంతరం అంకాపూర్‌లోని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి నివాసానికి వెళ్లనున్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో
గెలుపు ఎవరిదో?

- ఇంకా జోరందుకోని ప్రచారం
- నేటితో ముగియనున్న నామినేషన్ల గడువు
- కుల సామాజిక వర్గాలుగా విడిపోయిన ఉపాధ్యాయులు





వంగ మహేందర్‌రెడ్డి



కూర రఘోత్తంరెడ్డి



అశోక్‌కుమార్



మల్క కొమురయ్య



నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇంకా జోష్ కనిపించడం లేదు. గతంతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో పెద్దగా ఎన్నికలపై ఆసక్తి పెంచేలా పరిణామాలు జరగడం లేదు. గతంలో నాయకుల మధ్య పోటీ తీవ్రంగా ఉన్న దరిమిళ ఈసారి కులాలు, సామాజికవర్గాల వారిగా ఉపాధ్యాయులు విడిపోయినట్లు ప్రచారం సాగుతోంది. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎక్కువగా గతంలో ఉన్న ఎమ్మెల్సీలకు సంబంధించిన సామాజికవర్గం వారు మళ్లీ పోటీ చేస్తుండగా బీసీ నినాదం ఈసారి ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని బీసీ కులగణనపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికలకు మరో 20 రోజుల సమయం ఉన్నప్పటికీ ఇప్పటినుంచే సామాజిక వర్గాల వారిగా ఉపాధ్యాయులు వేరువేరుగా సమావేశాలను నిర్వహిస్తూ తమ వర్గం వారిని గెలిపించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నామినేషన్లకు గడువు సోమవారంతో ముగియనుండగా ఇప్పటికే తొమ్మిది మంది అభ్యర్థులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నామినేషన్లను దాఖలు చేశారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నిక 15 జిల్లాల పరిధిలో జరుగనుండగా మొత్తం 27వేల 88 మంది ఓటర్లు ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికతో పోలిస్తే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక విషయంలో ఇంకా ఎక్కడ కూడా ప్రచారం జోరందుకోలేదు. గతంతో పోలిస్తే ఈసారి ప్రచారంలో అభ్యర్థులు వెనుకబడ్డారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి బీజేపీ తరపున మల్క కొమురయ్య నామినేషన్ దాఖలు చేయగా పీఆర్‌టీయూ తరపున వంగ మహేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అశోక్ కుమార్‌కు టీపీటీఎఫ్, యూటీఎఫ్, యూఎస్‌పీసీ సంఘాలు మద్దతు తెలుపుతుండగా మాజీఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డికి ఎస్‌టీయూ సంఘం మద్దతు తెలుపుతోంది. మిగిలిన అభ్యర్థులు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో దిగుతున్నారు.

15 జిల్లాల పరిధిలో 27వేల 88 మంది ఓటర్లు

నిజామాబాద్,కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ గత ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రస్తుతం 15 కొత్త జిల్లాలు ఏర్పడ్డాయి. దీంతో ఈ నియోజకవర్గ పరిధిలో మొత్తం 15 జిల్లాలలో 27వేల 88 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. ఇందులో 16,932 మంది పురుష ఓటర్లు, 10,156 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 470 ఓట్లు ఉండగా 325 మంది పురుషులు, 145 మంది మహిళలు ఉన్నారు. మంచిర్యాల జిల్లాలో 1,664 మంది ఓటర్లు ఉండగా పురుషులు 999 మంది, మహిళలు 660 మంది ఉన్నారు. నిర్మల్ జిల్లాలో మొత్తం 1966 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1282 మంది, మహిళలు 684 మంది ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 1593 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,095, మహిళలు 498 మంది ఉన్నారు. నిజామాబాద్ జిల్లాలో 3,751 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,176, మహిళలు 1,575 మంది ఉన్నారు. కామారెడ్డి జిల్లాలో 2,011 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,307, మహిళలు 704 మంది ఉన్నారు. జగిత్యాల్ జిల్లాలో 1,769 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1232, మహిళలు 537 మంది ఉన్నారు. పెద్దపల్లి జిల్లాలో 1111 మంది ఓటర్లు ఉండగా పురుషులు 647, మహిళలు 464 మంది ఉన్నారు. కరీంనగర్ జిల్లాలో 4305 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 2663 మంది, మహిళలు 1642 మంది ఉన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో (తరువాయి 8వ పేజీలో..)

వైభవంగా ధ్వజారోహనం

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు సీతారామ స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారి ప్రతిమలను పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం



ధ్వజారోహనం నిర్వహిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం వేదబ్రాహ్మణులు ఆలయ నిర్వాహకులతో కలిసి ధ్వజారోహన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుమిత్ శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో ఆలయంలో బేరిపూజ, అగ్ని ప్రతిష్ఠ, దేవత ఆహ్వానము, నిత్య హోమము, బలిహరణము, హనుమంతసేవ, మంత్రపుష్ప కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామానికి చెందిన గజవాడ సుశీలాబాయి, గజవాడ గంగాదాస్ కుటుంబ సభ్యులు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్, మండలి చైర్మన్ జంగం శాంతయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు నర్సారెడ్డి, పోశెట్టి, మాధురి, జితేందర్, సుదర్శన్, యాదగిరితోపాటు భక్తులు పాల్గొన్నారు.



డొంకేశ్వర్ ప్రభుత్వ ఆస్పత్రిలో
అత్యావసర సేవలకు ఇబ్బంది

- సాయంత్రం 4గంటలకే ఆసుపత్రి మూత
- 24 గంటల సేవలందించాలి అంటున్న ప్రజలు
- ఎమర్జెన్సీ టైంలో రోగులకు తప్పని తిప్పలు

.... వివరాలు 7లో

కన్నుల పండువగా రథోత్సవం

- స్వామి రథోత్సవ వేడుకకు కామారెడ్డి, సిరిసిల్లా నుంచి తరలివచ్చిన భక్తులు



శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సిరికొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంపల్లి గ్రామసమీపంలో గల ఎదురుగొండ శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి రథోత్సవం కన్నుల పండుగగా సాగింది. మూడురోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం స్వామి వారి కల్యాణం భక్తుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు మండలంలోని భక్తులే కాకుంగా పక్కనే గల కామారెడ్డి, సిరిసిల్లాకు చెందిన పలు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం జరిగిన రథోత్సం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్నారు. కల్యాణ మహోత్సవం, జాతరకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ తగు చర్యలు చేపట్టింది. కార్యక్రమంలో తూంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలాయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జాతరకు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.



నాళేశ్వర్‌లో ఆంజనేయ స్వామి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న హంపీ పీఠాధిపతి శ్రీవిద్యారణ్య భారతిస్వామి

రెండోరోజు కొనసాగిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవీపేట: మండలంలోని నాళేశ్వర్‌లో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, దత్తాత్రేయ, పోచమ్మదేవి ఆలయాల శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాల రెండోరోజైన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, ధాన్యాధివాసం, మూలమంత్ర జప తర్పణ హోమములు, శ్రీరాజరాజేశ్వర స్వామికి 501 కలశాలతో అభిషేకం, శయాధివాసము, పుష్పాధివాసము, ఫలాధివాసము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి, మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీపిట్ల కృష్ణ మహరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రవచనలు అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజైన సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు.



నాళేశ్వర్ రాజరాజేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న హంపీ పీఠాధిపతి



మహిళా సంఘాల ఆధ్వర్యంలో
సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు!

- ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- జాన్కంపేటలో 2 యూనిట్లను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం
- మిగతా మండలాల పరిధిలో ఏర్పాటు చేసేందుకు 150 ఎకరాల భూమి సేకరణ

నిజామాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రయోగాత్మకంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో కొన్ని సంఘాల ఆధ్వర్యంలో మొదట ఈ సోలార్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా ఈ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతీ సోలార్ విద్యుత్ కేంద్రాన్ని రూ. 3 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో 150 ఎకరాల భూమిని సేకరించడంతో పాటు మహిళా సంఘాల ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేసి నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సుమారు 68.4 ఎకరాలను సేకరించిన అధికారులు ఈనెల ఆఖరులోపు మిగతా భూమిని సేకరించి ఈ ఆర్థిక సంవత్సరం ముగింపులోపే సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.

150 ఎకరాల భూమిని సేకరణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. గ్రీన్ ఎనర్జీ పేరుమీద ఈ సోలార్ విద్యుత్‌ఉత్పత్తి కేంద్రాలను మహిళా సంఘాలతో ఏర్పాటుచేసి మరింత ఆ సంఘాలను బలోపేతం చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని ధర్పల్లి, బోధన్, వేల్పూర్, ఇందల్వాయి, ఎడపల్లి మండలాలతో పాటు ఇతర మండలాల పరిధిలో మొత్తం 150 ఎకరాల భూమిని సేకరించి ఈ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఒక్కొక్క కేంద్రానికి 4 ఎకరాల భూమి అవసరం ఉండడంతో ఆయా గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూమిని గుర్తించి వాటిలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మొత్తం 68.4 ఎకరాల భూమిని గుర్తించారు. ఎడపల్లి మండలం జాన్కంపేటలో 9.1ఎకరం, ఇందల్వాయి మండల కేంద్రంలో 10ఎకరాలు, వేల్పూర్ మండల కేంద్రంలో 5 ఎకరాలు, బోధన్ మండలం ఊటపల్లిలో 25ఎకరాలు, కొప్పర్గలో 9.3ఎకరాలు, ధర్పల్లి మండలం రామడుగులో 10ఎకరాలను గుర్తించారు. మొదట ఎడపల్లి మండలం జాన్కంపేటలో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. ఈ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి 1మెగావాట్‌కు 3కోట్ల రూపాయల ఖర్చవుతోంది. మహిళా సంఘాలు 30 లక్షలు సమకూరిస్తే మిగతా డబ్బులు బ్యాంకుల (తరువాయి 8వ పేజీలో..)

ఆనందాల వేడుక.. పూర్వ విద్యార్థుల కలయిక

● జిల్లాలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



నగరంలో 25 ఏళ్ల తర్వాత కలిసిన రాధాకృష్ణ విద్యాలయ విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):ఎప్పుడో 50 ఏళ్ల క్రితం చదువుకొని వివిధ వృత్తుల్లో, వ్యాపారాల్లో, ఉద్యోగాలలో స్థిరపడి 64ఏళ్ల వయస్సులో పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట కలిసి సందడి చేసిన వేడుకకు నగరంలోని కసాబ్‌గల్లిలోని రాధాకృష్ణ విద్యాలయం వేదిక అయ్యింది. 1973-74 సంవత్సరంలో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 64 ఏళ్ల వయస్సులో 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుకను నిర్వహించారు. ముందుగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. 7వ తరగతిలో బయటకు వెళ్లిపోయిన విద్యార్థులు మళ్లీ 64 ఏళ్ల వయస్సులో పూర్వ విద్యార్థులుగా ఒక్కచోట చేరి తమ మధురానుభూతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న పాఠశాలకు తమవంతు సహాయంగా సింటెక్స్ వాటర్ ట్యాంక్, ఎలక్ట్రిక్ మోటార్‌ను పాఠశాలకు అందజేశారు. ఆనాటి గురువైన నాగయ్య, పురం శంకర్‌లను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కె.బాబు, నాగభూషణం, మీసాల సుధాకర్ రావు,రాజారాం, సాంబయ్య, లక్ష్మి, నర్సయ్య, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

● 25 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

నగరంలోని కసాబ్‌గల్లి రాధాకృష్ణ విద్యాలయంలో 1998-99లో 7వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు నగరంలోని కపిల హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు.

● 28 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోస్రాలో 1996-97లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు నగరంలోని నిఖిల్‌సాయి హోటల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆనాడు చదువుచెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. 28 ఏళ్ల తర్వాత స్నేహితులంతా ఒక్కచోట కలవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఆనాటి మధురజ్ఞాపకాలను నెమరువేసుకొని మంచి చెడులను చర్చించుకున్నారు. విద్యార్థులంతా ఉన్నతస్థానంలో నిలవడంపై గురువులు సంతోషం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మహేశ్వర్‌రెడ్డి, గంగారెడ్డి, గణేష్, లక్ష్మణ్, మొగులయ్య, శంకర్‌గౌడ్, రవీందర్, స్వప్న, సుధాకర్‌రెడ్డి, కవిత, తదితరులు పాల్గొన్నారు.

● కోటగిరిలో ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కోటగిరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1999-2000 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. 24 ఏళ్ల అనంతరం కలుసుకోవడం ఆనందంగా ఉందని పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. తాము వివిధ రంగాల్లో స్థిరపడిన విషయాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. పూర్వ విద్యార్థులతో సమ్మేళనం స్నేహాభావంతో ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● కారేగాంలో..

పొతంగల్ మండలంలోని కారేగం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 2004-2005 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రావణ్, రాజు, రసుల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● లక్కోర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వేల్పూర్: మండలం లక్కోర గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వన్నెల్(బి) గ్రామానికి చెందిన 2007-08 పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు 17ఏళ్లకు తర్వాత ఒకే చోట కలుసుకొని పాతజ్ఞాపకాలను, మధురస్మృతలను పంచుకున్నారు. అనాటి తరగతి గదుల్లో చేసిన చిలిపిచేష్టాలు గుర్తు చేసుకుంటు పూర్వవిద్యార్థులు ఆనందంగా గడిపారు. చదువు నేర్పిన గురువులను శాలువ, పూలమాలలతో పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు.



28 ఏళ్ల తర్వాత కలిసిన మోస్రా జిల్లా పరిషత్ పూర్వ విద్యార్థులు



కోటగిరి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న వన్నెల్(బి)కి చెందిన 2007-08 పూర్వవిద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● ఆర్మూర్ ఎంఈవో రాజ గంగారాం



మగ్గిడి పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆర్మూర్ ఎంఈవో రాజ గంగారాం అన్నారు. శనివారం రాత్రి మండలంలోని మగ్గిడి గ్రామంలో పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు శిక్షణ పొంది పోటి పరీక్షల్లో నెగ్గి ఉద్యోగాలు సాధించారని, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత దుస్తులు, పుస్తకాలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం లాంటి ఎన్నో పథకాలు అందజేస్తున్నామని, తల్లిదండ్రులు తమపిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో వార్షికో త్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు జమలోద్దిన్, విశ్వనాథ్, హరిత, పీఆర్‌టీయు నాయకులు గోపాల్, సంగెం అశోక్, కృష్ణరెడ్డి, బాల్‌రాజ్, గోపి, సంతోష్, కిషన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోకన్‌పల్లిలో శివాజీ విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్సీ కవిత ఆర్థిక సహాయం



మోకాన్‌పల్లిలో నగదును అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నవీపేట,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లిలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్సీ కవిత 1.51లక్షల రూపాయలను ఆదివారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో పంపించారు. గతంలో గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. స్థానిక శివాజీ విగ్రహ కమిటీ సభ్యులు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత నగదును బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ రావు, మాజీ ఎంపీటీసీ జనార్ధన్, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షులు డాన్ సాయి ద్వారా సంబంధిత నగదును జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కవిత క్యాంప్ ఆఫీస్‌లో అందజేశారు.ఈ కార్యక్రమంలో సాయి చరణ్ గౌడ్, సాయి కుమార్, శివకుమార్‌లు ఉన్నారు.

ఈ బోర్డును నిలబెట్టరా..?



జాన్కంపేట్ గ్రామపేరు తెలిపే బోర్డు నిర్లక్ష్యంగా కిందపడవేసిన దృశ్యం

వేల్పూర్,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి):జాన్కంపేట్ గ్రామపేరు తెలిపే బోర్డును నిలబెట్టకుండా అలాగే వదిలే శారు. ఆర్మూర్, భీమ్‌గల్ వెళ్లే ప్రధానరహదారిలో జాన్కంపేట్ గ్రామవెళ్లే దారిలో గ్రామపేరు తెలిపే బోర్డును నిలబెట్టకపోవడం ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వదిలివేయడంతో కింద పడి ఉన్న బోర్డుపై పశువులు వెళ్తున్నాయి.అయినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు బోర్డును నిల బెట్టకపోవడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ పేరును తెలియచేసే బోర్డును సరైన పద్ద తిలో నిలబెట్టాలని స్థానికులు అర్‌అండ్‌బీ అధికారులను కోరుతు న్నారు.

రుద్రూర్‌లో విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాలు

● యాడ జాగ దొరికితే ఆగ వేసేయ్ పాగ
● రాజకీయ నాయకుల అండదండలతో స్థలాలు కబ్జాలు
● కన్నెత్తి చూడని రెవెన్యూ అధికారులు



రుద్రూర్‌లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన దృశ్యం

రుద్రూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): యాడ జాగ దొరికితే ఆడ వేసేయ్ పాగ అన్నచందంగా ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. రుద్రూర్ గ్రామంలోని కందూర్ గల్లీలో విలువైన ప్రభుత్వ భూములతో పాటు కందకాలను రాజకీయ నాయకుల అండదండలతో కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా భూములు కబ్జా చేస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. విలువైన భూములు కబ్జాకు గురవుతున్న రెవెన్యూ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాదాపు 2015 సంవత్సరం నుంచి భూములు కబ్జా అవుతున్న ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోవడం లేదని, అధికారుల అండ దండాలతో తాత్కాలిక పట్టాలు చేసుకుని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. రుద్రూర్ గ్రామంలో బీఎస్ఎన్ టవర్ వెనుకాల గల ప్రభుత్వ స్థలాన్ని కొందరు అక్రమార్కులు కబ్జా చేశారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలా ప్రభుత్వ స్థలాలను కబ్జాకు గురవుతున్న అధికారులు పట్టించుకోకపోవడం పై అంతర్యం ఏమిటని స్థానిక ప్రజలు ప్రశ్నించుకుంటున్నారు.

ముప్కాల్‌లో నేడు శివశ్రీనివాస కల్యాణం

ముప్కాల్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని దులగుట్టపై శివశ్రీనివాస కల్యాణం మల్లన్న జాతరను నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం శివశ్రీనివాస్ ఆలయంలో వేదపండితుల మంత్రోచ్చారణాల మధ్య ప్రత్యేకపూజలు, యజ్ఞం, నవగ్రహపూజ, రుద్రాబిషేకం నిర్వహించారు. నేడు శివశ్రీనివాస కళ్యాణం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సిద్దిరమేష్, కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ నగలు ఎక్కడా?

● దొంగతనం చేసిందెవరు ● ఫిర్యాదు చేయకపోవడంలో అంతర్యమేమిటీ?



ఆంజనేయస్వామి విగ్రహం



ఆర్మూర్ జంబి హన్మాన్ ఆలయ ప్రధాన ద్వారం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జంబి హన్మాన్ ఆలయంలో ఆంజనేయ విగ్రహానికి ప్రతీరోజు అలంకరించే వెండి నగలు ఎక్కడ ఉన్నాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత మూడు నెలల క్రితం జంబి హన్మాన్ ఆలయంలో దొంగలు పడి ప్రతీ రోజు అలంకరించే వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారని ప్రచారం జరుగుతుంది. గుర్తుతెలియని దొంగలు ఆలయం గేటును పగులగొట్టి అంజనేయ విగ్రహానికి ఉన్న నగలను మూడు నెలల క్రితం ఎత్తుకెళ్లారని భక్తులకు తెలిసింది. ఆలయ అధికారులు గుర్తుతెలియని దొంగలు ఆంజనేయ విగ్రహానికి అలంకరించే నగలను ఎత్తుకెళ్లితే ఇప్పటి వరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడంలో ఆంతర్యమేమిటోనని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ఇటీవల ఆలయ ఆవరణలో వంటశాలలో సిలిండర్ గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడితే ఫిర్యాదు చేసి ఎండోమెంట్ అధికారులు ఆంజనేయస్వామి వెండి నగలు చోరీకి గురైతే ఫిర్యాదు చేయకపోవడంలో అంతర్యమేమిటోనని భక్తులు ప్రశ్నిస్తున్నారు. రెండు నెలల క్రితం ఆలయ పూజరి ఆంజనేయస్వామి వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో ఆలయ అధికారి ఇన్‌చార్జీ చైర్మన్‌లు కలిసి పూజరిని బెదిరించి ఫిర్యాదు తిరిగి తీసుకోవాలని ఒత్తిడి చేసినట్టు దానికి తోడు ఆలయ పూజరిని తొలగించినట్టు తెలిసింది. ఎండో మెంట్ ఆధీనంతో ఉన్న జంబి హన్మాన్ ఆలయంలో అసలు ఏం జరుగుతుంది, ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది. బాధ్యతగా ఉండాల్సిన ఎండోమెంట్ అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో భక్తులు ఆగ్రహవేశాలు వెల్లగక్కుతున్నారు. అసలు దొంగతనం చేసిందేవరో ఉన్నతాధికారులు వెలికితీసి హన్మాన్ ఆలయం నగలను కాపాడాలని భక్తులు వేడుకుంటున్నారు.

ఆర్మూర్ గ్రంథాలయ సందర్శన



ఆర్మూర్‌లో పాఠకులతో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గ్రంథాలయాన్నిఆది వారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి సందర్శించారు. గ్రంథాలయంలో పాఠకులతో వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. రాబోవు వేసవి కాలం దృష్ట్యా మంచినీటి సౌకర్యం కల్పిస్తామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మొదటి అంతస్తులో జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. మొదటి అంతస్తు భవనం నిర్మాణం పూర్తికాగానే డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తామని పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్,కాంగ్రెస్‌నాయకులు అజ్జురాజు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల కోసం పడిగాపులు

● ఇప్పటి వరకు అందని పింఛన్లు ● లబోదిబోమంటున్న వృద్ధులు, దివ్యాంగులు



రుద్రూర్‌లో పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

రుద్రూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల సొమ్ము కోసం లబ్దిదారులు పడిగాపులు కాస్తున్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో ఇప్పటి వరకు పింఛన్లు అందకపోవడంతో వృద్ధురాలు, వికలాంగులు, వితంతువులు లబోదిబోమంటున్నారు. గత నెల జనవరి 27వ తేదీన పెన్షన్‌లు వచ్చాయని, ఈ నెలలో ఇప్పటి వరకు పెన్షన్‌లు రాకపోవడంతో వృద్ధురాలు, వికలాంగులు, వితంతువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకటో తారీకు వచ్చిందంటే చాలు ఆసరా పెన్షన్ల కోసం ఆశగా ఎదురు చూస్తుంటారు. ఇక ప్రతి నెల పోస్టాఫీస్‌లో పెన్షన్ దారులకు అవస్థలు మాత్రం తప్పడం లేదు. పెన్షన్ల కోసం ఉదయం నుంచే పోస్టాఫీస్ ముందు క్యూ కడుతున్నారు. పెన్షన్‌లు ఇప్పటి వరకు రాకపోవడంతో వృద్ధురాలు, వికలాంగులు, వితంతువులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి పెన్షన్‌లను విడుదల చేయాలని వృద్ధురాలు, వికలాంగులు, వితంతువులు కోరుతున్నారు.

బాధితుడికి చెక్కు అందజేత

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 9:(ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ఆమెడ నరేందర్ అనేబాధితుడికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం మండలకాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి అందజేశారు.ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందిన నరేందర్‌కు రూ.60వేల మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుచ్చిమల్లయ్య, నల్ల గణేష్ గుప్త, నిమ్మ ప్రసాద్, వేముల గంగారెడ్డి, పాష, ఆజారోద్దీన్, సాయి, ప్రదీప్ తదితర నాయకులు పాల్గొన్నారు.

జీపీ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

వర్ని,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ వర్ని మండల నూతన కమిటీని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ ఆధ్వర్యంలో ఆదివారం వర్ని మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ తెలిపారు. అధ్యక్షుడిగా సాయిలు, ఉపాధ్యక్షుడిగా సాయి చరణ్, సాయవ్వ, ప్రధాన కార్యదర్శిగా లింగయ్య, సహాయ కార్యదర్శులుగా రేఖ, మారయ్య, కోశాధికారిగా రాజు, కార్యవర్గ సభ్యులుగా శిరోమణి, గంగారాం, లక్ష్మి, సావిత్రి ఎన్నికయ్యారు.

కమ్మర్‌పల్లి బ్యాంట్‌మెంటెన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 9:(ఆంధ్రజ్యోతి) కమ్మర్‌పల్లి బ్యాట్ మెంటెన్ అసోసియోషన్ నూతన పాలకవర్గం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ మెరకు సభ్యుల సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడుగా ఆకుల బాలకిషన్, ఉపాధ్యక్షుడుగా జోగ (టీవీఎస్) గంగాధర్, ప్రధాన కార్యదర్శింగా చివేరి పవన్ కుమార్, కోశాధికారిగా సురంగి చంద్రశేఖర్‌లు ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఢిల్లీ ఎన్నికల ఫలితాలు.. తెలంగాణాలోనూ వస్తాయి: మేడపాటి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలాగానే బీజేపీ తెలంగాణలోనూ అధికారంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన బోధన్‌లో మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీ ఎన్నికలలో బీజేపీ విజయం సాధించడం అభినందనీయమన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఒక సీటు కూడా గెలవలేకపోయిందని ఆయన ఆరోపించారు. తెలంగాణలోనూ వచ్చే ఎన్నికలలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. తెలంగాణ యువత బీజేపీ వైపు చూస్తుందని పేర్కొన్నారు. ఢిల్లీలో సీఎం సీటు కైవసం చేసుకున్న సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ సత్తా చాటి విజయం సాధించేలా కృషి చేస్తామన్నారు.

ఇస్సాపల్లిలో బీజేపీ నాయకుల సంబరాలు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల బాణ సంచ కాల్చి మిటాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయ కత్వంలో సుస్థిర ప్రభుత్వం బీజేపీతోనే సాధ్యమవుతుందని, నమ్మిన ఢిల్లీ ప్రజలు బీజేపీకి పట్టం కట్టారన్నారు. ఆప్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నో ఉచిత పథకాలు ప్రకటిం చినప్పటికీ ఢిల్లీ ప్రజలు బీజేపీనే నమ్మరన్నారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీహరి, బార్లచిన్న ముత్తెన్న, బాకాయి సురేష్, భానుచందర్, ఉమ్మెడ చిన్నయ్య, చిరంజీవి, ముత్తెన్న, సాయిరెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



ఇస్సాపల్లిలో సంబరాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బాధిత కుటుంబాలకు సునీల్‌కుమార్ పరామర్శ



కోడిచర్లలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

మెండోర, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిచర్ల గ్రామంలో రోడ్డు ప్రమాదంలో ఇటీవల తీవ్రంగా గాయపడ్డ శ్రీకాంత్‌ను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల కోడిచర్ల, చాకిర్యాల్ గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాంత్ తీవ్రగాయాలతో నిర్మల్ ప్రైవేటు ఆసుపత్రిలో 15రోజుల చికిత్స పొంది ఇటీవల ఇంటి కి చేరుకున్న విషయం తెలుసుకున్న ముత్యాల సునీల్ కుమార్ శ్రీకాంత్‌ను పరామర్శించియోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, దేవేందర్, రవి, నరేందర్ ఉన్నారు.

చిట్టాపూర్‌లో గ్రామదేవతలకు జలాభిషేకం




గంగా జలాలను తీసుకువస్తున్న వీడీసీ సభ్యులు

ముప్కాల్, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి):బాల్కొండ మండలం చిట్టాపూర్ గ్రామంలో గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. ఆదివారం ఉదయం గోదావరికి వెళ్లి గంగజలాలను తీసుకువచ్చివలగొడుగులు, డప్పువాయిద్యాలు, మంగళ హారతులతో మహిళలు గ్రామ వీధులగుండా గంగజలాలను తీసుకు వచ్చి గ్రామదేవతలకు జలాభిషేకం నిర్వహించారు. పాడిపంటలు, ప్రజలు ఆయు రారోగ్యాలతో సంతోషంగా ఉండాలని వేడకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పిరమిడ్ కేంద్రాలు గొప్ప శక్తి క్షేత్రాలు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): పిరమిడ్ కేంద్రాలు గొప్ప శక్తి క్షేత్రాలని, పిరమిడ్‌లో ధ్యానం చేయడం వల్ల విశ్వంలో ఉన్నట్టువంటి విశ్వశక్తిని తీసుకుని మానవుడు సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తాడని పిరమిడ్ మాస్టర్ శ్రీ భాగ్యలక్ష్మి అన్నారు. ఆదివారం అమ్దాపూర్ గ్రామంలో పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో శాఖహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా పిరమిడ్ మాస్టర్ సుబ్బారావు,జిల్లా పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు న్యాయవాది సాయికృష్ణ రెడ్డి, పిరమిడ్ నిర్మాణకత భాగ్యలక్ష్మి, బోధన్ సాయిలు, వెంకటేష్, చిదుర రాజు, లక్ష్మణ్,మల్లారం సాయినాథ్, పరిగె మోహన్, యాదయ్య తదితరులున్నారు.

జర దేఖో!!




ఏడో పోలీస్ బెటాలియన్‌లో కంకర తేలిన రోడ్లు

గుంతలమయంగా రోడ్లు

» ప్రజానీకానికి తప్పని ఇబ్బందులు



డిచ్‌పల్లి- దూస్‌గాం రోడ్డు గుంతలమయంగా మారిన దృశ్యం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా డిచ్‌పల్లి మండలంలో బీటీరోడ్లు గుంతలమయంగా మారిన గత ప్రభుత్వంలోని పాలకులు మరమ్మతులు చేయకపోవడంతో అట్టి రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. మండలంలోని దూస్‌గాం, ఏడో పోలీస్ బెటాలియన్, ఘన్‌పూర్ గ్రామాల్లోని బీటీ రోడ్లు గుంతలమయంగా మారడంతో గ్రామీణ ప్రజలు నిత్యం నరక యాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్లపై ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు సాహసించడం లేదు. ఏడో బెటాలియన్‌లో రోడ్లు పూర్తిగా రాళ్లు తేలడంతో వా హనాలను పక్కన బెట్టి కాలినడకన పోలీసులు, సిబ్బంది ఇతర ప్రాంతాలకు పనుల కోసం వెళ్తూ పనులు చేసుకుంటున్నారు. ఘన్‌పూర్ చెరువుకట్టపై గుంతలు ఏర్పడిన అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గుంతలమయంగా మారిన బీటీ రోడ్లను మరమ్మతులు చేయించాలని గ్రామీణ ప్రజలు స్థానికులు కోరుతున్నారు.

మార్మోగిన సాయినాథుని నామస్మరణ

మద్నూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం సాయినాథుని నామస్మరణతో మార్మోగింది. ప్రతీ ఏడాది మద్నూర్ సాయిబాబా ఆలయం నుంచి నసురుల్లాబాద్ మండలం నెమ్లి సాయిబాబా ఆలయానికి భక్తులు పాదయాత్రగా వెళ్తారు. అందులో భాగంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ కమిటీ చైర్మన్ ప్రకాష్ ఆధ్వర్యంలో భక్తులు కాలినడకన బయలుదేరి వెళ్లారు. తెల్లవారు జాము నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. సుమారు వెయ్యికిపైగా భక్తులతో తరలివెళ్లారు. ప్రధాన వీధులైన గాంధీ చౌక్, రథ్‌గల్లీ నుంచి సాయి నామస్మరణతో తరలివెళ్లారు. మేనూర్, డోంగ్లి గ్రామాలలో భక్తుల కోసం అక్కడి భక్తులు అల్పాహార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తిరిగి ఆర్టీసీ బస్సుల్లో మద్నూర్‌కు చేరుకున్నారు. ప్రతీ ఏడాది నిర్వహిస్తున్న పాదయాత్రకు భక్తులు పెరుగుతుండటంతో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. మద్నూర్ మండల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు పరమేష్ పటేల్, నాయకులు బసవంతరావు పటేల్, మూగ గ్రామంలో సాయి భక్తుల కోసం అల్పాహార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మద్నూర్ నుంచి బయలుదేరిన పాదయాత్ర సాయి నామంతో మార్మోగింది. గ్రామగ్రామాన పాదయాత్ర భక్తులకు ఆయా గ్రామస్థులు స్వాగతం పలికారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



మద్నూర్ నుంచి సాయి ఆలయానికి పాదయాత్రగా వెళుతున్న భక్తులు

డొంకేశ్వర్ ప్రభుత్వ ఆస్పత్రిలో

ఫోకస్

అత్యవసర సేవలకు ఇబ్బంది

» సాయంత్రం 4గంటలకే ఆస్పత్రి మూత » 24 గంటలు సేవలందించాలంటున్న ప్రజలు » ఎమర్జెన్సీ టైంలో రోగులకు తప్పని తిప్పలు



డొంకేశ్వర్ ప్రభుత్వ ఆస్పత్రి

డొంకేశ్వర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల 24గంటలు వైద్యసేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ ఆసుపత్రిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యసేవలు అందు బాటులో ఉన్నాయి. మండల వ్యాప్తంగా సుమారు 22వేల 634 మంది జనాభా ఉన్నప్పటికీ 24 గంటల వైద్యసేవలు అందుబాటులో లేవు. సాయంత్రం రాత్రి సమయాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగిన సమయాల్లో నందిపేట, నిజామాబాద్ ఆసుపత్రులకు సుమారు 15నుంచి 35కిలోమీటర్ల దూరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుంది. 24గంటల సేవల అందించడానికి ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. డొంకేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 12గంటలు ఆసుపత్రిలో ఏడు గంటల సేవలు మాత్రమే అందుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటి 24 గంటల వైద్యసౌకర్యాం లేక ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. ఇక్కడి ఆస్ప త్రిలో తగినంత సిబ్బందితో పాటు పలు రకాలైన వైద్యం కూడా చేయడానికి అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయి. రెండు బెడ్ల ప్రాథమిక ఆస్పత్రిలో గర్భిణులకు రక్త పరీక్షలు, బీపీ, మూత్ర పరీక్షలు కూడా చేస్తారు. కానీ ఉదయం నుంచి సాయంత్రం వరకే సిబ్బంది విధుల్లో ఉండడంతో సాయంత్రం, రాత్రి సమయాల్లో ఏమైనా అవసరమైతే ఇబ్బంది తప్పడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలస కూలీలు ఎక్కువగా ఉన్నా ఈ ప్రాంతంలో సాయం త్రం 4 గంటల తర్వాత చికిత్స కోసం వలస కూలీలు వస్తుంటారు. సరైన సమయానికి చికిత్స అందకా ఇబ్బందులు పడు తున్నా రు. ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే..

డొంకేశ్వర్ ప్రభుత్వ ఆస్పత్రిల్లో 24 గంటల వైద్యసేవలు లేకపోవడంతో మండల ప్రజలు సాయంత్రం, రాత్రి సమయాల్లో పాముకాటు, కుక్క కరిచిన హార్ట్ ఎటాక్ విష జ్వరం కడుపునొప్పి అనుకొని ప్రమాదాలు తదితర పరిస్థితుల్లో నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి వెళ్ళాల్సిందే. ఈ మారుమూల దుండటం నుంచి జిల్లా కేంద్రానికి చేరుకోవాలంటే పేమెంట్‌కు సుమారు గంట సమయం పడుతుంది. లోగా ప్రథమ చికిత్స చేయలేకపోతే ఆ మనిషి చనిపోయే ప్రమాదం ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

24 గంటలు వైద్య సేవలు అందించాలి

● సురేందర్, డొంకేశ్వర్



డొంకేశ్వర్ ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు ఉన్నప్పటికీ 24గంటల వైద్యసేవలు అందడం లేదు. చిన్నపాటి జ్వరం వచ్చిన ప్రైవేటు వారి ని ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. పాము, కుక్క కరిచిన ఏదైనా అనుకొని ప్రమాదం జరిగిన జిల్లా కేంద్రానికి వెళ్తున్నాం. డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటల వైద్యసేవలు అందించాలి.

ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి

● డాక్టర్ విద్యాసాగర్, వైద్యాధికారి, డొంకేశ్వర్



డొంకేశ్వర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. రోజుకు సుమారు 70 నుంచి 80మంది వరకు పేషెంట్‌లకు సేవలు అందిస్తున్నాం. గర్భిణులకు రోగులకు అన్నిరకాల పరీక్షలు చేయడానికి ల్యాబ్ సౌకర్యం ఉంది. ప్రభుత్వం అందించే వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

దోమకొండ ఠాణాకు ఎస్సై వచ్చేదెన్నడో..!?

● నెలకుపైగా పోలీసుస్టేషన్‌కు ఎస్సైని కేటాయించని వైనం ● ఏఎస్సైకి అదనపు బాధ్యతలు
● అంతంతమాత్రంగానే శాంతిభద్రతల నిర్వహణ,కేసుల పరిష్కారం



దోమకొండ పోలీసు స్టేషన్

దోమకొండ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దోమకొండ ఠాణాకు సబ్ఇన్స్‌పెక్టర్ లేక నెల గడుస్తుంది. గత నెలన్నర క్రితం భిక్కనూర్ ఎస్సై సాయికుమార్ ఆత్మహత్య చేసుకోవడంతో భిక్కనూర్ పోలీసు స్టేషన్‌కు దోమకొండలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై డి. అంజనేయులును ఉన్నతాధికారులు భిక్కనూర్‌కు బదిలీ చేశారు. అప్పటి నుంచి దోమకొండలో ఎస్సై సీటు ఖాళీగానే ఉంటుంది. శాంతి భద్రతల నిర్వహణను ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి చూస్తున్నారు. అయితే నెలకు పైగా ఎస్సైను కేటాయించకపోవడంతో అంతంతమాత్రంగానే శాంతిభద్రతల నిర్వహణ కొనసాగడంతో పాటు కేసుల పరిష్కారం నత్తనడకన సాగుతుందనే విమర్శలు ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి. కేసు పరిష్కారం కోసం ఠాణా మెట్లు ఎక్కుతున్న వారికి రోజుల తరబడి తిరిగాల్సి వస్తుందనే వాపోతున్నారు. అయితే గత రెండురోజుల క్రితం ఓ మహిళ ఎస్ఐ బాధ్యతలు స్వీకరించి ట్రైనింగ్ కోసం మూడురోజులు వెళ్లినట్లు సమాచారం.

గాడితప్పుతున్న శాంతి భద్రతలు

దోమకొండ ఠాణాకు ఎస్ఐను కేటాయించకపోవడంతో ఏఎస్సై సుబ్రహ్మణ్యచారీకి బాధ్యతలు అప్పగించారు. అతనికి సైతం ఎస్సైగా ప్రమోషన్ రావడంతో ఆయన సైతం రేపో మాపో ట్రైనింగ్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. అతను సైతం వెళ్తె శాంతిభద్రతలు గాడితప్పుతాయనే వాదనలు లేకపోలేదు. గత కొన్ని రోజుల క్రితం మెదక్ జిల్లా నుంచి ఏఎస్సైగా జానీ పాషా దోమకొండకు వచ్చారు. ఏఎస్సై నూతనంగా దోమకొండ రావడం, కానిస్టేబుళ్లు సైతం కొత్త బ్యాచ్‌కు చెందిన వారు ఉండటం వలన కొన్ని నెలల వరకు దోమకొండలో శాంతిభద్రతల రక్షణకు కత్తిమీద సాములాగేనే మారుతుంది. కొన్ని రోజుల నుంచి పోలీసులు గ్రామ సభల్లో కూడా బందోబస్తు ఇవ్వడం ఎస్సై లేకపోవడం, ఏఎస్సై పూర్తి బాధ్యతలు నిర్వర్తిచడం విధి నిర్వహణలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నప్పటికి కొన్ని గ్రామాల్లోకి క్షేత్ర స్థాయిలో పోలీసులు చేరలేకపోతున్నారు.దీంతో కొంత మంది ఆకతాయిలు మద్యంమత్తులో రోడ్లపై చిందులు వేస్తూ బీభత్సం సృష్టిస్తున్నారని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ఎవరైనా అడ్డుకునే ప్రయత్నం చేస్తే వారిపై తిరగబడుతున్నారు.

ఇష్టారీతిన పార్కింగ్‌తో వాహనదారులకు ఇక్కట్లు

ప్రధాన రహదారిలో వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపడం, రాంగ్ పార్కింగ్ చేయడంతో ఆర్టీసీ బస్సులకు ఇబ్బందులు తప్పడం లేదు.మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గొడవలు జరుగుతున్నాయి. పోలీసులకు సమాచారం అందగానే ఏఎస్సై సుబ్రహ్మణ్యచారీ సిబ్బందితో చేరుకుని అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నప్పటికి గొడవ సద్దుమనుగడం లేదు. దీంతో ఇంచార్జ్ ఎస్సై ఆంజనేయులు, సీఐ సంపత్ కుమార్‌లు సంబంధిత గ్రామాలకు చేరకుని పరిస్థితిని అదుపు చేయాల్సి వస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దోమకొండకు ఎస్సైని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



స్వామివారిని పల్లకిలో ఊరేగింపుగా కొలిప్యాక్ ఆలయానికి తీసుకువస్తున్న భక్తులు

కొలిప్యాక్‌లో ప్రారంభమైన ఆనందగిరి లక్ష్మీనర్సింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లి మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో ఆనందగిరి లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం జాతర బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయ అర్చకులు మోహన్‌శర్మ ఆధ్వర్యంలో జాతర బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి అర్చకులు పూజలు నిర్వహించిన అనంతరం గ్రామం నుంచి ప్రత్యేక అలంకరణ చేసిన పల్లకిలో స్వామి వారిని ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా గ్రామప్రధానవీదులగుండా మేళ తాళాలు, మంగళహారతులతో మహిళలు గ్రామం నుంచి గుట్టపైకి తీసుకు వెళ్లారు. అనంతరం ఆలయంలో స్వామివారి ప్రత్యేక పూజలు చేసి మొక్కు లు తీర్చుకున్నారు. సోమవారం ధ్వజారోహణం, మంగళవారం స్వామివారి కళ్యాణం, బుధవారం రథోత్సవం, గురువారం చక్రతీర్థం, నాగవెళ్ళి, శుక్ర వారం కొండ బలితో ఉత్సవాలు ముగుస్తాయని అర్చకులు మోహన్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆది వారం జరిగిన ఉత్సవాల్లో నాయకులు దీకొండ శ్రీనివాస్, డిష్‌బాలయ్య, అజ య్, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు కోదండ రామాలయ వార్షికోత్సవ వేడుకలు



బీర్కూర్‌లో ముస్తాబైన రామాలయం

బీర్కూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రామాలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రానుండటంలో ఉదయం 8 గంటలకు అభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవచనం, సర్వతో బాద్ర మండపారాధన, నవగ్రహ మండపరాధన, ప్రధాన దేవత ఆరాధన, హోమం, పూర్ణా హుతి, నీరాజనం, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం రామాలయం ఎదుట గల ఆర్యవైశ్య సంఘంలో మహా అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి వేడుకల్లో పాల్గొనాలని సభ్యులు కోరారు.

మాధవా నంద సరస్వతి స్వామీజీని కలిసిన

శబరిమాతా ఆశ్రమ కమిటీ సభ్యులు

తాడ్వాయి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సద్గురు శబరి మాతాజీ ఆశ్రమ కమిటీ సభ్యులు ఆదివారం ఉదయం మెదక్ జిల్లా రంగంపేటలో గల పరివ్రాజక మాధవానంద సరస్వతి స్వామి వారిని తాడ్వాయి ఆశ్రమ కమిటీ సభ్యులు దర్శించుకున్నారు. పరమ హంస సచ్చిదానంద సద్గురు శబరి మాతాజీ 25వ సంవత్సరం నిర్వికల్ప మహా సమాధి సమారాధన శ్రీరామ నవమి రోజున జరిగే రజతోత్సవ కార్యక్రమానికి స్వామి వారిని ఆహ్వానించి వారి సూచన మేరకు కార్యక్రమాలు నిర్వహణ గురించి స్వామి వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో వేముల శంకరయ్య, నేతి కృష్ణమూర్తి, దూడం శ్రీనివాస్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ భరద్వాజ్, ఇప్ప కాయల పండరి, అరిభ బాలకిషన్ రావు, గడ్డం వేణు, ఆకుల రామశంకర్, దేవారెడ్డి, నేతి నగేష్, గిరిధర్‌రావు దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

లక్షలతో నిర్మించారు.. లక్షణంగా వదిలారు!

ఆంధ్రజ్యోతి పరిశీలన



పురాణిపేట్‌లో నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం



పిచ్చిమొక్కల మధ్య మృతదేహం కాల్చే దృశ్యం



పిచ్చిమొక్కల మధ్య వైకుంఠధామం శిలాఫలకం

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): మనిషి వందేళ్లు బతికినా చివరికి చావు తప్పదు చనిపోయిన మనిషిని కల్పడానికి అంత్యక్రియలకు వచ్చిన బంధువులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేసి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైకుంఠ ధామాలను నిర్మించింది. ఈ పథకంలో బా గంగానే భీమ్‌గల్ మండలంలోని పురాణిపేట్ గ్రామంలో రూ.12లక్షల 60వేలతో వైకుంఠ దామం నిర్మించారు. 2021మార్చి 16న ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. అది అప్పటి నుంచి వృథాగా ఉంది. అందులో పిచ్చిమొక్కలు పెరిగిన అడవిని తలపిస్తుంది. గ్రామంలో ఎవరైనా చనిపోతే గ్రామం దగ్గర ఉన్న పాత శ్మశాన వాటిక దగ్గరే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. దీంతో వచ్చే పొగ చుట్టు పక్కల వ్యాపించడంతో రోగాలకు గురవుతున్నారు. చుట్టు పక్కల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి లక్షల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన వైకుంఠ దామాన్ని ఉపయోగంలోకి తెచ్చి అందులో అన్ని సౌకర్యాలు కల్పించాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించి వైకుంఠధామాన్ని ఉపయోగంలోకి తెస్తాం

● జితేందర్, పంచాయతీ కార్యదర్శి, పురాణిపేట్



వైకుంఠధామం వృథాగా ఉన్న మాట వాస్తమమే. వైకుంఠ ధామాలను ప్రభుత్వ స్థలంలోనే నిర్మించడం జరిగింది. కానీ ఇక్కడికి చనిపోయిన వారిని తీసుకుపోవడానికి దారి విషయంలో రైతుల పట్టాభూమి ఉండడంతో వాళ్లు అటు వెళ్ళనీయడం అడ్డుకుంటున్నారు. రోడ్డు విషయంలో చాలా సార్లు గొడవలు జరిగాయని అన్నారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్య పరిష్కారం చేసి వైకుంఠదామాన్ని ఉపయోగంలోకి తీసుకువస్తాం.

నవీపేటలో తల్లిదండ్రులకు పూజోత్సవం



విద్యార్థులను ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

నవీపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఆదివారం మాతాపిత కృతజ్ఞత పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ మోటివేషన్ స్పీకర్ శ్రీహరి విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. తమ పిల్లల ఉన్నతికి తల్లిదండ్రులు ఎంతగానో పాటుపడతారని, పిల్లలు సైతం తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా చక్కగా చదివి మంచి ప్రయోజకులు కావాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాలలో చదివే విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిషన్, మండల అధ్యక్షులు భూమయ్య, పాఠశాల కరస్పాండెంట్ హన్మాండ్లు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన సిద్దిపేట జిల్లా రైతులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్ గ్రామాన్ని ఆదివారం సిద్దిపేట జిల్లా నారాయణరావు పేట మండల రైతులు సందర్శించారు. ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గ నైజింగ్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామాన్ని సందర్శించిన రైతులు పంటల సాగు, అంకాపూర్ గ్రామాభివృద్ధి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అంతకుముందు రైతులు పసుపు, జొన్న, కూరగాయల పంటలను పరిశీలించారు. అనంతరం గురడి రెడ్డి సంఘ భవనంలో రైతులతో సమావేశమయ్యారు. పంటలో రైతులు సాగులో అవలంబిస్తున్న పద్ధతులు, దిగుబడులు, మార్కెటింగ్ సౌకర్యం, తది తర విషయాలను గురడిరెడ్డి సంఘ కార్యదర్శి కేకే భాజన్న వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి, రాజా రెడ్డి, శంకర్, రఘు పతి, భూం రెడ్డి, దేవారెడ్డి, సీతవో పాల్గొన్నారు.



అంకాపూర్‌లో పంటల సాగును పరిశీలిస్తున్న సిద్దిపేట జిల్లా రైతులు



నివాళులర్పిస్తున్న నాయకులు

యాదగిరి స్ఫూర్తితో విప్లవోద్యమాలను నిర్మిద్దాం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తొలి తరం విప్లవోద్యమ నేత యాదగిరి స్ఫూర్తితో బలమైన విప్లవోద్యమాలను నిర్మించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్రకార్యదర్శి దేవారాం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని గౌడ్స్ కాలనీలో యాదగిరి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరి జిల్లాలో విప్లవ ఉద్యమాలకు పునాదులు వేశారని అన్నారు. అనేక మంది కార్యకర్తలను తీర్చిదిద్ది అందరికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. మోర్తాడ్, సిరికొండ, భీంగల్, మండలాల్లో పెత్తందారుల దోపిడికి వ్యతిరేకంగా విప్లవ పోరాటాలు నిర్మించిన కమ్యూనిస్టు యోధుడు అని అన్నారు. నేటి యువత యాదగిరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోదావరి, అరుణోదయ సాంస్కృతిక సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాధర్, నాయకులు జయప్రద, సత్తెవ్వ, నాగమణి, సత్యనారాయణ, గంగాధర్, నాగరాజు, సునంద, తదితరులు పాల్గొన్నారు.

కౌలాస్ కోట అద్భుతమైన కట్టడం



కౌలాస్ కోటపై ఫిరంగిని పరిశీలిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): జుక్కల్‌లోని కౌలాస్‌కోట అద్భుతమైన కట్టడా లకు నిలయమని కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం కౌలాస్ కోటను జిల్లాకు చెందిన పోలీస్ అధికారులతో కలిసి సందర్శించారు. కౌలాస్ గ్రామానికి చేరుకున్న ఎస్పీ సింధూశర్మ పోలీస్ అధికారులతో కలిసి కాలినడకన కోటకు బయలుదేరారు. కోటలో ఉన్న పురాతన కట్టడాలను పరిశీలించి కోటంతా సుమారు 3గంటలపాటు కలియ దిరిగారు. కోటపై ఏర్పాటు చేసిన 9గజాల ఫిరంగి, హ నుమాన్ ఆలయం, రామాలయం, సరస్వతీ మాత ఆలయం, వెంకటేశ్వర మందిరం, పట్టే మంచం, తామర కొలను, కల్లిఖార్జున బురుజు, ఆయుధగారం, ధాన్యాగారాలు, కందకాలు మొదలగు వాటిని పరిశీలించారు. అక్కడి నుంచి కోటలో నెలవై ఉన్న ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఆలయ అర్చకులు పోలీస్ అధి కారుల బృందానికి అమ్మవారి ఆశీస్సులతో పా టు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సింధూశర్మ మాట్లాడుతు ప్రాచీనమైన కౌలాస్ కోట అనేక అద్భుతమైన కట్టడాలకు నిలయంగా మారిందని పేర్కొన్నారు. గత వైభవం ఉట్టిపడేలా కోట చరిత్ర ఉండటం గర్వకారణమని కొనియాడారు. కోటకు సంబంధించిన విషయాలను గ్రామానికి చెందిన రాజవంశస్తురాలు అనితాసింగ్ పోలీస్ అధికారులకు వివరించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్, బాన్సువాడ టౌన్ సీఐ అశోక్, బిచ్కుంద సీఐ నరేష్, ఎస్సైలు భువ నేశ్వర్, మహేందర్, విజయ్ కొండ, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడి పిల్లల వ్యాన్ బోల్తా

● 2వేల కోడిపిల్లలు మృతి ● రూ.లక్ష నష్టం



గోర్గల్ శివారులో బోల్తాపడిన పౌల్ట్రీ కోడిపిల్లల రవాణా వ్యాన్

నిజాంసాగర్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): వెంకాబ్ కంపెనీకి చెందిన కోడిపిల్లలను రవాణా చేసే క్రమంలో డీసీఎం బోల్తా పడి మూడు వేల కోడిపిల్లలు మృతిచెందాయి. రెండు వేల కోడిపిల్లలు సురక్షితంగా బయటపడ్డాయి. ఈ సంఘటనలో దాదాపు రెండు లక్షల రూపాయల మేరకు నష్టం వాటిల్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజాంసాగర్ మండలం గోర గాల్ గ్రామశివారులో ఆదివారం తెల్లవారుజామున మెదక్ జిల్లా మనోహరాబాద్ మండ లం మాసాయిపేట నుంచి వెంకాబ్ కోడి పిల్లల ఉత్పత్తి కేంద్రం నుంచి సంగారెడ్డి జిల్లా కల్హేరు మండలం మహదేవ్‌పల్లి గ్రామ శివారులో ఉన్న ఓ పౌల్ట్రీ ఫారానికి ఈ వ్యాన్‌లో 500 కోడి పిల్లలను డీసీఎం వ్యాన్‌లో రవాణా చేస్తున్నారు. నిజాంసాగర్ మండలం గోరుగల్ శివారులోనికి రాగానే ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయిన డీసీఎం వ్యాన్ టైర్ రాడు ఊడిపోవడంతో అదుపు తప్పి పంట పొలాలలోకి దూసుకువెళ్లి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు వెంకాబ్ సంస్థ సిబ్బంది ప్రాణాలతో బయటపడ్డారు. రవాణా అవుతున్న ఐదు వేల కోడి పిల్లలకు గాను 3వేల కోడి పిల్లలు ప్రమాదంలో చనిపోయాయి. 2వేల కోడి పిల్లలను కల్హేరు మండలం మహదేవ్‌పల్లి గ్రామ శివారులోని పౌల్ట్రీఫార్మ్‌కు తరలించారు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలు సుకున్నారు. వెంకాబ్ సంస్థ సిబ్బంది బోల్తాపడ్డ డీసీఎం వద్దకు చేరుకుని వివరాలను సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు

నిజాంసాగర్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రధాన కాలువలో చేపలు వేయడానికి వెళ్లిన ఒక వ్యక్తి ఆదివారం గల్లంతయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామ నివాసి అయిన కర్నూలు విట్టల్ (40) సంవత్సరాలు అనే వ్యక్తితో పాటు కొరబ సాయిలు గుంటి సాయిలు కలిసి ప్రధాన కాలువ లోనికి చేపలు పట్టుకోవడానికి వెళ్లారు. చేపలు పట్టుకునే ప్రయత్నంలో విఠల ప్రమాదవశతో కాలుజారి నిజాంసాగర్ ప్రధాన కాలువ పడి గల్లంతయ్యాడు. వంద నంబర్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కుటుంబ సభ్యులు మృతదేహం కోసం వెతుకుతున్నారు. నిజాంసాగర్ ప్రధాన కాలువ నీటి ప్రభావం ఉధృతంగా ఉండడంతో నే కర్రే విఠల్ కిందికి కొట్టుకుపోయి ఉండవచ్చునని నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వెంటన పోలీసులు కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ఎవరిదో?

(5వ పేజీ తరువాయి)

950 మంది ఉండగా పురుషులు 677 మంది, మహిళలు 273 మంది ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 2690 మంది ఓటర్లు ఉండగా 1,520 మంది పురుషులు, 1170 మంది మహిళలు ఉన్నారు. మెదక్ జిల్లాలో 1,347 మంది ఓటర్లు ఉండగా 799 మంది పురుషులు, 548 మంది మహిళలు ఉన్నారు. సిద్ధిపేట జిల్లాలో 3212 మంది ఓటర్లు ఉండగా 2020 మంది పురుషులు 1192 మంది మహిళలు ఉన్నారు. హన్మకొండ జిల్లాలో 166 ఓట్లు ఉండగా 126 మంది పురుషులు 40 మంది మహిళలు ఉన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 83 ఓట్లు ఉండగా 64 మంది పురుషులు, 19 మంది మహిళలు ఉన్నారు.

పోటీలో హేమా హేమీలు

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హేమా హేమీలు పోటీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 16 సెట్ల నామినేషన్లు దాఖలు కాగా 9 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. శ్రీకాంత్ సిలవేరు, కూర రఘోత్తంరెడ్డి, చెలిక చంద్రశేఖర్, తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి, మామిడి సుధాకర్‌రెడ్డి, మల్క కొమురయ్య, అశోక్‌కుమార్, వంగ మహేందర్‌రెడ్డి, ముత్తారం నర్సింహస్వామిలు ఇప్పటి వరకు నామినేషన్లు దాఖలు చేశారు. సోమవారం నామినేషన్ల గడువు ముగియనుండగా ఉపసంహరణ గడువు ఈనెల 13తో ముగియనుంది. ఆ తర్వాతనే పోటీలో ఉండే అభ్యర్థులపై స్పష్టత వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ ముఖ్యంగా పోటీ ఉపాధ్యాయ సంఘాలలో అతిపెద్ద సంఘమైన పీఆర్‌టీయూ తరపున పోటీ చేస్తున్న వంగ మహేందర్‌రెడ్డి, బీజేపీ తరపున పోటీ చేస్తున్న మల్క కొమురయ్య, టీపీటీఎఫ్, యూటీఎఫ్ మద్దతుతో పోటీ చేస్తున్న అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డిల మధ్య ఉండే అవకాశాలు ఉన్నాయి. గతంలో పీఆర్‌టీయూ తరపున పోటీ చేసి గెలుపొందిన తాజా మాజీ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డిని కాదని పీఆర్‌టీయూ వంగ మహేందర్‌రెడ్డిని అభ్యర్థిగా నిలిపింది. మొత్తం 27వేల ఓట్లలో పీఆర్‌టీయూకి దాదాపుగా 17వేలకు పైగా సభ్యత్వం ఉండటంతో గెలుపుపై పీఆర్‌టీయూ సంఘం నమ్మకంతో ఉంది. కానీ పీఆర్‌టీయూ నుంచి గత ఎన్నికల్లో గెలుపొందిన కూర రఘోత్తంరెడ్డి తనకు పీఆర్‌టీయూలో ఒక వర్గం మద్దతు ఉన్నట్లు చెబుతుండటంతో ఏ మేరకు ఓట్లు పడతాయో అనేది తేలాల్సి ఉంది. బీసీ సామాజిక వర్గానికి చెందిన అశోక్‌కుమార్‌కు టీపీటీఎఫ్, యూటీఎఫ్‌ల మద్దతు ఉంది. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన అనుభవం, ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమాలు చేసిన చరిత్ర కలిగి ఉండటం కలిసొచ్చే అంశం. సిద్ధిపేటకు చెందిన అశోక్‌కుమార్ మాజీ సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడిగా తెలంగాణ ఉద్యమ సమయంలో పనిచేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా జేఏసీ చైర్మన్‌గా పనిచేశారు. ప్రముఖ విద్యా వ్యాపార వేత్త మల్క కొమురయ్య బీజేపీ తరపున పోటీ చేస్తున్నారు. ఈయనకు తపస్ ఉపాధ్యాయ సంఘం మద్దతు ఉంది. బీజేపీ నుంచి పోటీ చేస్తుండటం ఈయనకు కలిసొచ్చే విషయం. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో ముగ్గురు ఎంపీలు బీజేపీకి చెందినవారే ఉండగా ఏడుగురు ఎమ్మెల్యేలు బీజేపీ వారే ఉండటం గెలుపుపై ఆశలను పెంచుతుంది. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. విద్యావంతులు ఎక్కువగా బీజేపీ వైపు మొగ్గు చూపడం ఈయనకు కలిసొచ్చే అంశంగా విశ్లేషకులు భావిస్తున్నారు.

ఖరీదైన ఎన్నిక

గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఖరీదైన ఎన్నికగా మారింది. తక్కువగా ఓట్లు ఉండటం వల్ల ఓటర్లను కొనుగోలు చేయడం సులువుగా అయ్యే వ్యవహారం కావడంతో ఆ దిశగా అభ్యర్థులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తుంది. గతంతో పోలిస్తే ఈసారి ఓటర్ల సంఖ్య పెరగడంతో ఈ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడవుతుంది. పీఆర్‌టీయూ సంఘంతో పాటు బీజేపీ అభ్యర్థి బలపరుస్తున్న అభ్యర్థులు బలమైన సామాజిక వర్గంతో పాటు వ్యాపార వేత్తలు కూడా కావడంతో భారీగా ఖర్చు పెట్టే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ అభ్యర్థులతో పోలిస్తే టీపీటీఎఫ్, యూటీఎఫ్ బలపర్చిన అభ్యర్థి అశోక్‌కుమార్ అంతగా ఖర్చు చేసే అవకాశాలు లేవు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశ్యంతో అభ్యర్థులు భారీగానే ఖర్చు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇదే అదనుగా ఇప్పటినుంచే విందులు, వినోదాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాల్లో అభ్యర్థులు ఉన్నారు.

జోరందుకోని ప్రచారం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఇంకా జిల్లాలో ప్రచారం జోరందుకోలేదు. పట్టభద్రుల అభ్యర్థి అడపాదడపా జిల్లాకు వస్తున్నప్పటికీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు మాత్రం ఇంకా ప్రచారాన్ని ప్రారంభించలేదు. పీఆర్‌టీయూ అభ్యర్థి గత నెల రోజుల క్రితం జిల్లాలో ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య సైతం నోటిఫికేషన్ విడుదలైన తర్వాత జిల్లాకు వచ్చి వివిధ ఉపాధ్యాయ సంఘాలతో భేటీ అయ్యారు. అశోక్ కుమార్ మాత్రం ఇంకా జిల్లాకు రాలేదు. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం జోరుగా సాగుతుండగా కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం మాత్రం నప్పగా సాగుతుంది. అంతర్గతంగా ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ బహిరంగంగా ఇంకా అభ్యర్థులు ప్రచారాన్ని ప్రారంభించలేదు. సోమవారం నామినేషన్ల గడువు ముగియనుండటంతో మంగళవారం నుంచి అభ్యర్థులు ప్రచారం చేసే అవకాశాలు ఉన్నాయి.

సామాజికవర్గాలుగా ప్రచారం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి గతానికి భిన్నంగా ప్రస్తుతం ప్రచారం సాగుతుంది. సామాజిక వర్గాలుగా ఉపాధ్యాయులు విడిపోయి ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఒక సామాజిక వర్గానికి చెందిన వారు మూడుసార్లు ఎమ్మెల్సీగా గెలుపొందిన దరిమిళ ఈసారి ఇతరులకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఒకవర్గం వారు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. 2007లో కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి మొట్టమొదటిసారిగా ఎన్నిక జరుగగా పీఆర్‌టీయూ తరపున బట్టాపురం మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందారు. ఆ తర్వాత 2013లో పాతూరి సుధాకర్‌రెడ్డి గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో కూర రఘోత్తంరెడ్డి గెలుపొందారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీ కులవర్గీకరణ, ఎస్సీ వర్గీకరణ అంశం చర్చనీయాంశంగా ఉన్న నేపథ్యంలో ఉపాధ్యాయులు సైతం తమ వర్గం వారికి ఓటువేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది. గతంలో జరిగిన ఎన్నికలు నాయకుల మధ్య ఎన్నికగా పరిగణించగా ఈ ఎన్నికలు కులసమీకరణాల వారిగా జరిగే అవకాశాలు ఉన్నాయి. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పనిచేసే వారిని గెలిపించేందుకు ఉపాధ్యాయులు నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ జడ్పీ చైర్మన్, మాజీ మేయర్

కేటీఆర్‌ను కలిసిన మాజీ జెడ్పీ చైర్మన్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ మేయర్ దండు నీతూకిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌తో జిల్లా రాజకీయాల విశేషాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

రామస్వామికి ఇందూరు భారతి ఘన నివాళి

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి రచయిత మేక రామస్వామికి ఇందూరు భారతి ఘన నివాళులర్పించింది. ఆదివారం తెలుగు రచయితల సమైక్య ఇందూరు భారతి ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఇందూరు భారతి సంస్థకే కాక ఎన్నో సాహితీ సంస్థలతో మేక రామస్వామికి ప్రత్యేక అనుబంధం ఉందని అన్నారు. సినీ నటుల పుట్టిన రోజు వేడుకలతో పాటు వారితో అనుబంధాన్ని కలిగి ఉండి తనకంటూ ప్రత్యేక స్థానం నిలుపుకున్నారని అన్నారు. మేక రామస్వామి మృతి తీరనిలోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్ బెల్లాల్, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి పరిస్థితి విషమం

● హైదరాబాద్ తరలింపు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బీ) గ్రామ శివారులో శనివారం సాయంత్రం మాధవనగర్ నుంచి ధర్మారం వెళ్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ జగన్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఎస్సై షరీఫ్ కుటుంబ సభ్యుల సూచన మేరకు వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. మరో ముగ్గురు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

భిక్కనూరు, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన నారాయణ ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.



పీఆర్‌టీయూ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా పీఆర్‌టీయూ ఆవిర్భావ వేడుకలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం నగరంలోని పీఆర్‌టీయూ భవనంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, కిషన్‌ల ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పలు సంవత్సరాలు పీఆర్‌టీయూలో వివిధ హోదాలో పనిచేసిన రామారావు, సాయిలు, జ్యోతి, భవంతి గోవర్ధన్, రాజేందర్‌గౌడ్, నర్సింహరెడ్డి, సుదర్శన్‌గౌడ్, రాజేందర్‌సింగ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీతలు మాట్లాడుతూ ఉపాధ్యాయుల స్థితిగతులను మార్చి ఎన్నో సమస్యలను పరిష్కరించిన ఏకైక సంఘం పీఆర్‌టీయూ అన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వంగ మహేందర్‌రెడ్డిని గెలిపించి సంఘ బలోపేతానికి తోడ్పాటునందించాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోరారు. కార్యక్రమంలో సరిత, వరలక్ష్మి, రాధా, రవీందర్‌రెడ్డి, చిలుక శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు

● ఆందోళనలో ట్యాంకు పక్కన ఉన్న నివాసితులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం (బీ) పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం పక్కన గత 50 ఏళ్ల క్రితం నిర్మించిన రక్షిత ట్యాంకు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ట్యాంకు ఏ సమయంలో కూలుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ట్యాంకు నాలుగు బాగాల్లో ఇనుప చువ్వలు బయటపడి భయాందోళనకరంగా మారింది. జిల్లా పరిషత్ అధికారులకు ఆలయ కమిటీ ప్రతినిధి రావుల బ్రహ్మానందం ట్యాంకును తొలగించాలని ఫిర్యాదు చేసినా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు శిథిలావస్థకు చేరిన ట్యాంకును తొలగించి స్థానికులను కాపాడాలని కోరుతున్నారు.



పెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారిన ట్యాంకు

మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు

(5వ పేజీ తరువాయి)

నుంచి రుణాలుగా ఇస్తారు. ఉత్పత్తి ప్రారంభించినప్పటి నుంచి ఆ విద్యుత్‌ను ఎన్‌పీడీసీఎల్‌కు, జెన్‌కోకు అమ్మకాలు చేస్తారు. దాని ద్వారా వచ్చే ఆదాయంతో మహిళ సంఘాలు బ్యాంకు రుణాలను తీర్చడంతోపాటు మిగతా డబ్బును సంఘాల బలోపేతానికి వినియోగించనున్నారు. జాన్కంపేట పరిధిలో రెండు సోలార్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు మహిళ సంఘాల ఆధ్వర్యంలో 60 లక్షలను సిద్ధంచేసి ఇప్పటికే ప్రభుత్వానికి పంపించారు. జిల్లాలో ఇతర మండలాల పరిధిలో కూడా భూ సేకరణ పూర్తిచేసి ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెలాఖరులోపు ప్రభుత్వానికి సంబంధించిన 150 ఎకరాలను ఆయా మండలాల పరిధిలో గుర్తించి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా ఈ సోలార్ విద్యుత్ ఉత్పత్తికేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జాన్కంపేటలో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిన అధికారులు మిగతాగ్రూప్‌లకు సంబంధించి ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. రెడ్కో ద్వారా ఈ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కేంద్రప్రభుత్వం కూడా ప్రాధాన్యత ఇవ్వడంతో వీటిని జిల్లాలో ఏర్పాటుచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రయోగాత్మకంగా మొదట జాన్కంపేటలో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయగౌడ్ తెలిపారు. ఈ రెండింటిని మొదట ఏర్పాటుచేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామన్నారు. మిగతా వాటికి కూడా భూమిని గుర్తిస్తూ ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు.

నేడు హంపీ పీఠాధిపతి రాక

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పలు ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పరమపూజ్య హంపీ విద్యారణ్య భారతిస్వామి నగరానికి రానున్నారు. సోమవారం నగరంలోని అమ్మ వెంచర్‌లో నూతనంగా నిర్మించనున్న వారాహిమాత దేవిఆలయ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అదేవిధంగా పలు ఆలయాల్లో జరిగే పూజా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

బావిలో పడి యువకుడి మృతి

సదాశివనగర్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందని కళ్లెం సిద్దిరాములు (17) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందినట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. ఆదివారం పాతచెరువు పక్కన ఉన్న వ్యవసాయబావి వద్దకు కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మరణించినట్లు తెలిపారు. గజ ఈతగాళ్లతో శవాన్ని బయటకు తీయించినట్లు తెలిపారు. మృతుని తండ్రి గంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భక్తి శ్రద్ధలతో శివ స్వాముల పడిపూజ

బిచ్కుంద, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో భక్తిశ్రద్ధలతో శివస్వాములు పడిపూజ నిర్వహించారు. ఆదివారం బిచ్కుంద గ్రామం శివనామస్మరణతో మారుమోగింది. బాన్సువాడ బిచ్కుంద మద్నూర్, నారాయణఖేడ్, బోధన్, మండలాలకు చెందిన శివస్వాములు శివనామ స్మరణలో పాల్గొని పడిపూజ నిర్వహించారు. బిచ్కుంద మండలం ఖద్గావ్ మల్లికార్జున మహరాజ్ పడి పూజలో పాల్గొని శివస్వాముల చేత పూజలు నిర్వహించారు.

నాగారంలో ఆరోగ్య వైద్య శిబిరం

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్ జన్మదినం సందర్భంగా ఆదివారం నగరంలోని నాగారంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. నోవాలైఫ్ ఆసుపత్రి, ఇతర ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వ హించి రోగులకు ఉచిత పరీక్షలు చేసి మందులు అందజేశారు.

విజయవంతమయిన వైద్యా శిబిరం

సిరికొండ: మండలంలోని కొండపూర్‌లో ఆదివారం శ్రీ శివసాయి ఆసుపత్రి ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరానికి ప్రజల నుంచి అనూహ్యంగా స్పందన లభించింది. గ్రామంలోని పలువురుకి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందలును అందజేసినట్లు డాక్టర్ సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు నర్సయ్య, జగన్,మాజీ సర్పంచ్ ఆకుల రాములు, మాజీ ఉపసర్పంచ్ సుమన్, శేఖర్, మూత లింబాద్రి, మహేందర్ తదితరులున్నారు.

అమెరికా అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం

సిరికొండ, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో భారతీయుల పట్ల ఆ దేశ అధ్యక్షుడు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ఆదివారం సిరికొండలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు ట్రంపు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ భారతీయలు నేరం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంపు బేడీలు వేయించి విమానం ఎక్కించడం జాతీ అహంకారమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ నాయకులు రిక్కా దామోదర్, మండల నాయకులు లింబాద్రి, కిషోర్, రమేష్, కిషోర్, ఆశీష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ట్రంపు దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న మాస్‌లైన్ నాయకులు

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.180	రూ.250	రూ. 270
వెన్‌కాబ్(కిలో)	: రూ.190	రూ.260	రూ. 280

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.87,100	రూ.80,400	రూ.995

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : పట్టుదల (10.05, 1.15, 4.25, 7.35, 10.45)
స్క్రీన్-3 : స్కై ఫోర్స్ (హిందీ) (10.15)
: డాకూ మహారాజ్ (1.00, 7.20)
: దేవ (హిందీ) (4.05, 10.25)
స్క్రీన్-4 : దేవ (హిందీ) (10.00, 7.10)
: స్కై ఫోర్స్ (హిందీ) (1.15, 10.25)
: మద గజ రాజ (4.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : తండేల్ (1.20, 4.15, 7.15, 10.00)
స్క్రీన్-2 : తండేల్ (11.00)
: సంక్రాంతికి వస్తున్నాం (1.45, 7.30)
: సనం తేరీ కసం (హిందీ) (4.30, 10.10)
స్క్రీన్-3 : సనం తేరీ కసం (హిందీ) (1.40, 7.30
: పట్టుదల (4.40, 10.30)

దేవి : డాకుమహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : బాదాస్ రవికుమార్ (హిందీ) : (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : తండేల్ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్